అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న విద్యావేత్త రూప

చిక్కడపల్లి, జూన్ 16: విద్యార్థులు వచ్చిన ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పలువురు విద్యావేత్తలు అన్నారు. బాగ్ లింగంపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో ఎంబీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థుల కోసం ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ ప్లేస్మెంట్ డ్రైవ్‌ని ఆదివారం నిర్వహించింది. ప్రముఖ విద్యావేత్త రూప విద్యార్థులకు పలు సూచనలు చేశారు. వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతిభ ఉన్నవారికి తప్పకుండా అవకాశాలు వస్తాయని తెలిపారు. కళాశాల డైరెక్టర్ రిషికాంత్, ప్రిన్సిపాల్ నాగరాజు, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ చాగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ ఆధ్వర్యంలోనే దేశం అభివృద్ధి

సమావేశంలో మాట్లాడుతున్న సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు తదితరులు

కాచిగూడ, జూన్ 16: ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. ముఖ్య నాయకులతో బర్కత్‌పుర నగర బీజేపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. 19వ తేదీన కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు నగరానికి రానున్న సందర్భంగా వారికి భారీ ఎత్తున ర్యాలీగా స్వాగతం పలకాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రేమేందర్‌రెడ్డి, కె.వెంకటేశ్వర్లు, చింతల రాంచంద్రారెడ్డి, ఆనంద్‌గౌడ్, మాజీ మంత్రి కృష్ణయాదవ్, రాజశేఖర్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌గౌడ్, నందకిశోర్‌యాదవ్ పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..

భోలక్‌పూర్ డివిజన్‌లో ఎక్కడి చెత్త అక్కడే అన్న చందంగా తయారైంది. అధికారులు, పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఆదివారం రోడ్లపై ఇలా చెత్త పేరుకుపోయి దర్శన మిచ్చింది. – కవాడిగూడ

ప్రశాంతంగా యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష

సైఫాబాద్ సైన్స్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జే లక్ష్మణ్‌నాయక్

సుల్తాన్‌బజార్, జూన్ 16 : యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఈ మేరకు మాసబ్‌ట్యాంక్‌లోని సైఫాబాద్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షా కేంద్రాన్ని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జే లక్ష్మణ్ నాయక్‌తో కలిసి కేంద్రంలో జరుగుతున్న పరీక్షా విధానాన్ని ఆమె పరిశీలించారు. పరీక్ష రాసేందుకు వచ్చే అభ్యర్థులకు అన్ని వసతులు కల్పించడం జరిగిందని ఆమె అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ.. కళాశాల సెంటర్‌లో మొత్తం 124 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సింది ఉండగా 77 మంది అభ్యర్థులు హాజరయ్యారని అన్నారు. ఇదిలా ఉండగా కోఠిలోని మహిళా విశ్వ విద్యాలయంలో నిర్వహించిన యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షా కేంద్రం వద్ద సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. కేంద్రంలో పరీక్ష రాసేందుకు వచ్చే అభ్యర్థులను పూర్తి స్థాయిగా పరీక్షించిన అనంతరమే అనుమతించారు.

ఛాదర్‌ఘాట్ గోవుల తరలింపు కేసు పక్కదారి

- ప్రాణాలకు తెగించి పట్టుకుంటే గోవుల జాడ లేకపోవడం దారుణం
- ఎద్దులను తరలిస్తున్న వాహనాలను గుర్తించకపోవడం పోలీసుల నిర్లక్ష్యానికి నిదర్శనం
- యువతులను చంపేస్తామని ద్విచక్ర వాహనాల పైకి ఎక్కించేందుకు ప్రయత్నించిన వ్యక్తులపై కేసు ఎందుకు నమోదు చేయలేదు
- వీహెచ్‌పీ ప్రముఖ్ బాలస్వామి, భజరంగ్‌దళ్ కన్వీనర్ శివరాములు

సుల్తాన్‌బజార్, జూన్ 16 : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఛాదర్‌ఘాట్ గోవుల తరలింపు కేసు దారి మల్లుతోందని, ప్రాణాలకు తెగించి గోవులను పట్టుకుంటే వాటి జాడ లేకపోవడం దారుణమని విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్‌లు ఆదివారం ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ మేరకు వీహెచ్‌పీ రాష్ట్ర ప్రముఖ పగుడాకుల బాలస్వామి, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు మాట్లాడుతూ.. ప్రాణాలకు సైతం తెగించి పట్టుకున్న తరలిస్తున్న రెండు వాహనాలను 30 గంటలు దాటుతున్నా గుర్తించకపోవడం పోలీసుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. వాహనాలను అడ్డుకున్న యువతులను చంపేస్తామంటూ ద్విచక్ర వాహనాల పైకి ఎక్కించేందుకు ప్రయత్నించిన వ్యక్తులపై ఇప్పటికీ ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. గుండు సూది పడిపోయినా పట్టుకొని తీసుకువచ్చే అధునాతనమైన టెక్నాలజీలో వారికి వాహనాలు ఎటు వెళ్లాయో తెలియక పోవడం శోచనీయమని ఎద్దేవా చేశారు. అక్రమంగా తరలిస్తున్న ఎద్దులు, వాటిని తీసుకువచ్చిన వాహనాలను వెంటనే సీజ్ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో భారీ ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఛాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో వాహనాన్ని నిలిపివేసిన యువతుల పోన్లు లాక్కోవడమే కాకుండా వాటిలోని వీడియోలను డిలీట్ చేసి సాక్ష్యాలను తారుమారు చేయడం దేనికి సంకేతమని వారు ఆరోపించారు. ఈ విషయమై పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి దోషులను కఠినంగా శిక్షించాలని, నిర్లక్ష్యం వహిస్తే ఆందోళన తప్పదని వారు హెచ్చరించారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన

ప్రముఖ నృత్య గురువు పసుమర్తి రామలింగశాస్త్రి నృత్య శిక్షణలో చిన్నారి నర్తకీమణులు పావులూరి రవీనా, రిషిత(కవలలు)ల తొలి భరత నాట్య సంప్రదాయ ప్రదర్శన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం నయనానందకరంగా సాగింది. ఈ సందర్భంగా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత మంజుల రామస్వామి, సీనియర్ పాత్రికేయులు వల్లీశ్వర్, మానసమూర్తి, అప్పారావు పాల్గొని నర్తకీమణులను అభినందించారు.

– తెలుగు యూనివర్సిటీ

పుస్తకాల ఆవిష్కరణ..

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు విద్యాధర్, బిక్కి కృష్ణ తదితరులు

చిక్కడపల్లి, జూన్ 16: విమల సాహితీ సమితి ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత డాక్టర్ జెల్దీ విద్యాధర్ రచించిన 'అంతరంగపు భాష', 'తోటమాలి మాలిమి' ఆంగ్ల అనువాద పుస్తకాలు 'వాయిస్ ఆఫ్ సౌల్', 'ద గార్డెన్స్ లవ్' పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సిటీ కల్చరల్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించారు. కళారత్న డాక్టర్ బి.కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పుస్తకాల అనువాదకుడు ఆంగ్ల కవి కొంపాక రవీంద్రాచారి, కవి సాహితీవేత్త ప్రొఫెసర్ జీవీ రత్నాకర్, కవయిత్రి రాధా కుసుమ, మంజుల సూర్య, పి.శ్రీనివాస్‌గౌడ్, సరికొండ నరసింహరాజు పాల్గొన్నారు.

సంక్షోభంలో ప్రభుత్వ విద్యారంగం: ఎస్‌ఎఫ్‌ఐ

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ అధ్యక్షుడు వి.పి.సాను

చిక్కడపల్లి, జూన్ 16 : దేశంలో ప్రభుత్వ విద్యారంగం సంక్షోభంలో ఉందని ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్షుడు వి.పి.సాను అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్‌ఐ) తెలంగాణ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వి.పి.సాను మాట్లాడుతూ.. ఎన్టీ సంస్థ నిర్వహించే నీట్ పరీక్ష పేపర్ లీకేజీ బీజేపీ పాలిత రాష్ట్రంలోనే జరిగిందన్నారు. నిర్వాహన వైఫల్యాలు బహిర్గతమయ్యాయని తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ.. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైందని కానీ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేరని, సమస్యలన్నీ పేరుకుపోయినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నూతన విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అందించడంలో గందరగోళం నెలకొందన్నారు. మండలాల్లోని పాఠశాలలకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ అందలేదని, మరోపక్క యూనిఫామ్‌లు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కొరత తీవ్రంగా వేధిస్తుందని అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్ మూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.శంకర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.వీరభద్రం, రమ్య అధ్యక్షతన వహించిన సమావేశంలో రజనీకాంత్, ఎం. మమత, కిరణ్, వీరభద్రం, అశోక్ రెడ్డి, ప్రశాంత్, శ్రీకాంత్, ఎస్. రజనీకాంత్, బి. శంకర్, సంతోష్, రాథోడ్, కె. ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ ప్రధాన కార్యదర్శిగా పరమేశ్వరిసింగ్

అబిడ్స్, జూన్ 16 : కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ డీసీసీ ప్రధాన కార్యదర్శిగా మంగళ్‌హాట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పరమేశ్వరిసింగ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిన్‌రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వరిసింగ్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు పాటు పడ్తానని తెలిపారు. ఈ పదవి లభించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి. రోహిన్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పరమేశ్వరిసింగ్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి. రోహిన్‌రెడ్డి

బాలరాజ్ గౌడ్‌కు నంది అవార్డ్

ఆదర్శ మ్యాట్రిమోని ఆదర్శకిరణం మాస పత్రిక, గౌడ సంఘాల జేఏసీ నాయకులు బాల్‌రాజ్‌గౌడ్‌కు శ్రీ మహానంది అవార్డు ప్రదానం చేసి సన్మానించారు. తెలంగాణ మ్యారేజీ బ్యూరో జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీసీ డాక్టర్ వకుళాభరణం కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్ రావు , నిర్వాహకుడు బుర్రా శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా బాల్‌రాజ్ గౌడ్ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పల్లెలక్ష్మణ్ గౌడ్, చీకటి ప్రభాకర్ గౌడ్, పద్మజ, ధర్మేందర్, విజయ్, అనురాధగౌడ్ పాల్గొనారు.

– చిక్కడపల్లి, జూన్ 16

పారిశుధ్య కార్మికులకు చీరెల పంపిణీ

పారిశుధ్య కార్మికులకు చీరెలు పంపిణీ చేస్తున్న వీహెచ్

అంబర్‌పేట, జూన్ 16 : అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి చీఫ్ అడ్వైజర్, రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు 76వ జన్మదినాన్ని పురస్కరించుకొని దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో మహంకాళి అమ్మవారికి పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు ఆయనకు ఘనంగా సన్మానం చేశారు. అదే విధంగా పారిశుధ్య కార్మికులకు చీరెలను పంపిణీ చేశారు. సేవా సమితి చైర్మన్ పి.జ్ఞానేశ్వర్ గౌడ్, చీఫ్ అడ్వైజర్ కె.దుర్గాప్రసాద్‌రెడ్డి, వైస్‌చైర్మన్ గడ్డం లక్ష్మణ్‌గౌడ్, అధ్యక్షుడు వై.శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రంగంపల్లి రాజు, కోశాధికారి గడ్డం శ్రీధర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బింది మల్లికార్జున్‌గౌడ్, కార్యదర్శి సీహెచ్ సుధాకర్, కార్యనిర్వాహక కార్యదర్శి డి. కిశోర్, మాజీ కార్పొరేటర్ పి. నారాయణ స్వామి, టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, కోటం అనిల్ కుమార్, రావుల సుధాకర్ పాల్గొన్నారు. అనంతరం, వీహెచ్ ఇంటి దగ్గర టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఖైరతాబాద్ జిల్లా డీసీసీ మహిళా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు గరిగంటి శ్రీదేవి రమేశ్, పులి జగన్, దిడ్డి రాంబాబు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలలో అక్రమాలు అరికట్టాలి

విద్యార్థులు, తల్లిదండ్రుల ముఖాముఖి సమావేశంలో మాట్లాడుతున్న క్రాంతికుమార్

రవీంద్రభారతి, జూన్16 : ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలలో అక్రమాలను అరికట్టాలని ఇండియన్ నేషనల్ యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు క్రాంతికుమార్ ప్రభుత్వాన్ని డి మాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంసెట్, నీట్ కోచింగ్‌ల పేరుతో లక్షలాది రూపాయలను తల్లిదండ్రుల వద్ద దోచుకుంటున్న ప్రైవేట్ విద్యావ్యవస్థలను నిర్మూలించాలన్నారు. ప్రతి ఆదివారం అన్ని ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలు ట్యూషన్స్‌ను బంద్ చేయాలని అన్నారు. ప్రతి ఇన్‌స్టిట్యూషన్‌లో ఫిమెల్ స్టూడెండ్స్ టాయిలెట్స్‌ను శుభ్రంగా ఉంచాలని, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులను బెదిరిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి కాలేజీలో ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడానికి టోల్ ఫ్రీనంబర్ పెట్టాలని, కాలేజీ బయట నోటీస్ బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యార్థులు ఎవరైనా సూసైడ్ చేసుకుంటే ఆ కాలేజీల లైసెన్స్‌లను రద్దుచేయాలని కోరారు. టీసీలు, సర్టిఫికెట్లు ఆన్‌లైన్ ద్వారా కాకుండా డైరెక్టుగా బోర్డు ద్వారా విద్యార్థులకు అందజేయాలని క్రాంతికుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కునాల్‌యాదవ్, ప్రవీణ్‌రెడ్డి, రోహిత్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రిలీఫ్ ఫండ్ ..

కార్వాన్ నియోజకవర్గం నానల్‌నగర్ డివిజన్ ఖాదర్‌బాగ్‌కు చెందిన మైమనాత్ మహిళకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ. 60 వేల ఎల్వోసీని ఆదివారం ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ లబ్ధిదారు తండ్రికి అందించారు. ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించడానికి కృషి చేస్తున్నామన్నారు.

మిర్జా మహ్మద్ బేగ్‌కు..

ముషీరాబాద్ నియోజకవర్గం భోలక్‌పూర్‌కు చెందిన మిర్జా మహ్మద్ బేగ్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.40 వేల ఎల్వోసీని ఆదివారం ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్ ఖాద్రి ఆమెకు అందించారు.

– మెహిదీపట్నం, జూన్ 16

భూమిలేని పేదలకు ప్రభుత్వం భూమి పంచాలి

సమావేశంలో మాట్లాడుతున్న జిలకర శ్రీనివాస్

చిక్కడపల్లి, జూన్ 16 : భూమిలేని పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం భూమి పంచాలని వీసీకే తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ తెలంగాణ(బొజ్జా తారకం)ఆధ్వర్యంలో ఆ పార్టీ కోఆర్డినేటర్ జన్ను సాంబయ్య అధ్యక్షతన 'భూమిని పంచు, బడ్జెట్ పెంచు' అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిలకర శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణలో అనేక దశాబ్దాలుగా భూమి కోసం పోరాటాలు జరిగాయని, భూ సంస్కరణ చట్టాలు రావడంతో మిగుల భూములు ఏర్పడ్డాయని అన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం భూములను వేలం వేస్తుందని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారులకు రెండు వందల యాభై గజాల భూమిని ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో హామీ ఇచ్చారని వెంటనే ఆ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఓబీసీ జాయ్ చైర్మన్ సాయిని నరేందర్, అంకేశ్వరపు రమేశ్, శ్యామ్, ఓబీసీ జేఏసీ నాయకులు చాపర్తి కుమార్ గాడ్గే, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ తెలంగాణ సీనియర్ నాయకుడు శ్రీరాములు, దాసరి రాజు, పీసరి రజిత, శారద, ఎండీ షాహిదా, సాంబలక్ష్మి, సమ్మక్క, విజయ, రమేశ్ చంద్ర, గునిగంటి రమేశ్ పాల్గొన్నారు.

అలరించిన సినీసుస్వరాలు

అవార్డులు బహూకరిస్తున్న దైవజ్ఞశర్మ

రవీంద్రభారతి, జూన్16 : మహతీ నాద స్వరాలు –గాన కళా సోపానాలు మ్యూజికల్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సినీ సుస్వరాల కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ విచ్చేసి గాయకులను మెమెంట్‌లు, శాలువాలతో సన్మానించారు. అనంతరం గాయకురాలు పద్మశ్రీ ఆధ్వర్యంలో పలువురు గాయని గాయకులు ఆలపించిన సినీ సుస్వరాలు వీక్షకులను అలరించాయి. సుభద్ర వాణి, అరుణ, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అన్నదానం..



పేదలకు సహాయం చేయాలనే దృక్పథంతో అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్‌ను ప్రారంభించి అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ అన్నారు. ఆదివారం ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖానలో ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి అన్నదాన వితరణ చేశారు. అసో సియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్ కుమార్, సంయుక్త కార్యదర్శి ఖాలేద్ అహ్మద్, ప్రచార కార్యదర్శి వైదిక్‌శస్త్ర, సభ్యులు బి. శంకర్, ముఖీం ఖురేషి, ఏపీఆర్వో మహ్మద్ అబ్దుల్‌వహీద్, మహమ్మద్ ముస్తఫా షరీఫ్, హబీబ్ చావుష్ అబ్దుల్ ముస్తఫా, యూనిట్ సభ్యులు శివకుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు. – సుల్తాన్‌బజార్

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాచిగూడ, జూన్ 16: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం, గుర్తుతెలియని వ్యక్తి (55) శంషాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారం–2 చివర్లో కొన్ని రోజులుగా అనారోగ్యంగా ఉంటూ శనివారం రాత్రి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై కాషాయ రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.2 ఉన్నట్లు పేర్కొన్నారు. కేసును కాచిగూడ రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సాహితీవేత్త డాక్టర్ ద్వానా శాస్త్రి నివాళి

చిక్కడపల్లి, జూన్ 16 : చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న ఎందరో మహనుభావులు మధుర స్మృతులలో భాగంగా ఆదివారం ప్రముఖ సాహితీవేత్త, పరిశోధకుడు రచయిత డాక్టర్ ద్వానా శాస్త్రి సంస్మరణ సభను నిర్వహించారు. సాహితీవేత్త రమణ వెలమణి హాజరై ద్వానాశాస్త్రి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వడ్లకొండ వెంకట్‌రావు, ఆమని పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు పూర్తి చేయండి : ఉమ

కాచిగూడ, జూన్ 16: స్థానిక ప్రజల సహకారంతో డివిజన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు కాచిగూడ కార్పొరేటర్ ఉమా యాదవ్ అన్నారు. డివిజన్‌లోని మౌలానా ఆజాద్‌నగర్ ప్రాంతంలో ఆదివారం ఆమె పర్యటించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జల మండలి అధికారులకు సూచించారు. అనంతరం, ఆమె మాట్లాడుతూ.. మౌలిక సదుపాయలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కన్నె రమేశ్ యాదవ్, సుభాష్ పటేల్, సాయి, నాగరాజు, కిరణ్, సంతోష్, రవి యాదవ్ పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్..

అబిడ్స్, జూన్ 16 : షాహినాయత్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటరమణారెడ్డిని సస్పెండ్ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. షాహినాయత్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో మైత్రి కమిటీ సభ్యులుగా పని చేస్తున్న శాంతిలాల్ వ్యాస్ అనే వ్యక్తి ద్వారా పోలీస్ స్టేషన్ పరిధిలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తున్న సుమారు ఎనిమిది మంది నుంచి వసూళ్లు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. మామూళ్ల వసూళ్లకు పాల్పడుతున్న సిబ్బంది ఆ సొమ్మును ఎవరికైనా అందిస్తున్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఫాదర్స్ డే



కార్వాన్ నియోజకవర్గంలోని గోల్కొండలో ఆదివారం ఫాదర్స్ డే వేడుకలను నిర్వహించారు. గోల్కొండ బోనాల కులవృత్తుల సంఘం అధ్యక్షుడు సాయిబాబాచారిని ఆయన కుమారులు శ్రీకాంత్ చారి, సురేశ్ చారి తమ స్నేహితులతో కలిసి సన్మానించారు. – మెహిదీపట్నం, జూన్ 16

అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలి..

ప్రజల అభివృద్ధి కోసం చేపట్టిన పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని నాంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ మజీద్ హుస్సేన్ అన్నారు. జీహెచ్ఎంసీ, జల మండలి, విద్యుత్, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో ఎమ్మెల్యే మజీద్ హుస్సేన్ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఆసిఫ్‌నగర్, మల్లేపల్లి, రెడ్‌హిల్స్, అహ్మద్‌నగర్, విజయ్‌నగర్ కాలనీ, మెహిదీపట్నం డివిజన్లలో పెండింగ్‌లో ఉన్న పనుల గురించి చర్చించారు. పనులు పూర్తి చేయడానికి అధికారులు కృషి చేయాలని అన్నారు.

– మెహిదీపట్నం, జూన్ 16

బక్రీద్ వ్యర్థాల కోసం ప్లాస్టిక్ కవర్ల పంపిణీ

బక్రీద్ పండుగ సందర్భంగా బలి ఇచ్చే జంతువుల వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా జాగ్రత్తలు పాటించాలని జీహెచ్ఎంసీ సర్కిల్ –12 ఏఎంఓహెచ్ డాక్టర్ విజయ్ తెలిపారు. ఇందుకు గాను అధికారులు ప్రత్యేకంగా నల్ల ప్లాస్టిక్ కవర్లను ఆదివారం మల్లేపల్లి, ఆసిఫ్‌నగర్, విజయ్‌నగర్ కాలనీ, రెడ్‌హిల్స్, మెహిదీపట్నం, అహ్మద్‌నగర్, గుడి మల్కాపూర్ డివిజన్లలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ప్రజలకు పంపిణీ చేశారు.

– మెహిదీపట్నం, జూన్ 16